
సాక్షి
విశాఖపట్నం

గురువారం । 22 । ఆగస్టు । 2024



ఎసైన్షియా కంపెనీ వద్ద గుమిగూడిన జనం


పొగలు వ్యాపించిన ఫ్యాక్టరీ భవనం


ఒళ్లంతా గాయాలు


భీతావహ స్థితిలో క్షతగాత్రుడు


తలకు, కళ్లకు గాయాలైన కార్మికుడు


స్ట్రెచర్‌పై క్షతగాత్రుడిని తీసుకెళ్తున్న దృశ్యం


విషాదవదనాలతో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు

కాటేసిన కార్ఖానా

కుప్పకూలిన శిథిలాల్లో నలిగిన ప్రాణాలు...
ఎగసిపడుతున్న మంటలు...పొగచూరిన పరిసరాలు
శ్వాస ఆడక.. మాట రాక.. పగిలిన గుండెలు
రసాయన మంటల్లో మసైపోయిన బతుకులు...
తునాతునకలైన దేహాలు...

రక్తాన్ని చెమటగా మార్చే కష్టజీవులు..
యంత్రాలకు చెట్లకు వేలాడే నెత్తుటి ముద్దలై...
అక్కడంతా బీభత్సం...మాటలకందని విషాదం..
ఎవరిది కాలో...ఎవరిది చేయో...తెలియని హృదయ విదారక స్థితిలో..
ముక్కలైన దేహాలను మూటకట్టి విసిరేసిన దుర్మార్గం..

తమ వాళ్లకేమైందో...జాడ తెలియక...బతికున్నారో లేదో అంటూ
లబలబలాడిన గుండెలతో పరిశ్రమ గేటు వద్దకు
పరుగులు తీసిన వారికి సమాధానం చెప్పే నాథుడు లేక...
అంతులేని నిర్లక్ష్యానికి, అనంత శోకానికి నిదర్శనంగా..
సెజ్‌లోని ఎసైన్షియా పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదం
పెను విషాదం నింపింది. జిల్లాలో ప్రకంపనలు రేపింది..


గాయపడ్డ ఉద్యోగి


తమవారి ఆచూకీ లేక విలపిస్తున్న మహిళ

పగిలిన గుండెలు.. నెత్తుటి ముద్దలు...

కెమి'కిల్' పరిశ్రమలో కాలిన బతుకులు

సంఘటనల క్రమం

దుర్ఘటన సమయం మధ్యాహ్నం 2.25	మృతుల తరలింపు మొదలు 5.00
క్షతగాత్రుల్ని బస్సుల్లో చేర్చింది 3.00	బంధువుల ఆందోళన రాత్రి 7.00
అధికారుల రాక 3.30	కేజీహెచ్‌కు మృతదేహాల తరలింపు 11.00
అగ్నిమాపక దళం ఆపరేషన్ 4.00	హోంమంత్రి రాక 12.40

ఎటు చూసినా మాంసపు ముద్దలే..

- ఎసైన్షియా కంపెనీలో భారీ ప్రమాదం
- పేలుడు ధాటికి చెల్లాచెదురైన కార్మికుల శరీరాలు
- 17 మంది మృతి.. శిథిలాల కింద మరో 9 మంది?
- హృదయ విదారకంగా అచ్యుతాపురం సెజ్‌లో పరిస్థితి
- సహాయక చర్యలు ఆలస్యం
- గంటన్నరైనా రాని అంబులెన్సులు
- కంపెనీ బస్సుల్లోనే క్షతగాత్రుల తరలింపు
- కేజీహెచ్‌కు మూటల్లో మృతదేహాలు

అంతా యువకులే...

ఎసైన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడినవారంతా యువకులే ఉండటం విషాదకరం. వివిధ జిల్లాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారు. నైపుణ్యం లేకపోయినా దాదాపు ఫార్మా కంపెనీల్లోనే ఎక్కువగా ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. ఈ కారణంగానే యువకులు ఎక్కువ శాతం మంది ఫార్మా పరిశ్రమల్లో చేరుతున్నారు. ఎసైన్షియా ఫార్మా పరిశ్రమలో దాదాపు 70 శాతం మంది 40 ఏళ్లలోపు యువతే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ప్రమాదంలో మృత్యు ఒడికి చేరిన వారిలో ఎక్కువ మంది 40 సంవత్సరాల్లోపు ఉన్న వారే కావడంతో అంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరిలో కొందరికి వివాహం కాలేదని తెలుస్తోంది. మరికొందరికి చిన్న వయసు పిల్లలున్నట్లు బంధువులు చెబుతున్నారు.

విశాఖ సిటీ/అచ్యుతాపురం/రాంబిల్లి / అనకాపల్లి: బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలు.. కొంత మంది భోజనానికి వెళ్లారు. మరికొంత మంది వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఒక్కసారిగా అణుబాంబు పేలినట్టు భారీ విస్ఫోటనం.. భూమి కంపించింది.. అచ్యుతాపురం సెజ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. 500 కిలోల సామర్థ్యం గల రియాక్టర్ పేలడంతో ఆ ధాటికి ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భవనం కుప్పకూలిపోయింది. దాని నుంచి దట్టమైన పొగ క్షణాల్లోనే కిలోమీటర్ వరకు వ్యాపించింది. ఏం జరిగిందో ఎవరికీ అంతుచిక్కలేదు. ఎసైన్షియా కంపెనీలో రియాక్టర్ పేలడంతో ఆ ప్రాంతం శవాల దిబ్బగా


క్షతగాత్రుడిని ఓదారుస్తున్న కుటుంబ సభ్యులు

మారింది. పేలుడు ధాటికి కార్మికుల శరీర భాగాలు వందల మీటర్ల వరకు చెల్లాచెదురయ్యాయి. చెట్లపైకి కాళ్లు, చేతులు ఎగిరిపడ్డాయి. మూడో అంతస్తులో రియాక్టర్ పేలడంతో ఆ భవనం నేలమట్టమైంది. కింద అంతస్తులో ఉన్న కార్మికులపై శ్లాబ్ కుప్పకూలడంతో సజీవ సమాధి అయిపోయారు. కొందరి మృతదేహాలు పూర్తిగా చికితిపోయి మాంసపు ముద్దగా మారిపోయాయి. 17మంది దుర్మరణం పాలవ్వగా 40 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు పాతికేళ్ల క్రితం హెచ్‌పీసీఎల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం తరువాత అతిపెద్ద పారిశ్రామిక విషాదంగా ఈ దుర్ఘటన నిలవనుంది.

కొంత ఆలస్యంగా సహాయక చర్యలు

అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న సెజ్.. పేలుడు ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల కంపెనీల్లో పనిచేసే కార్మికులు భయంతో పరుగులు పెట్టారు. సుమారు 15 నిమిషాల వరకు ఎసైన్షియా కంపెనీ వైపు వెళ్లడానికే భయపడిపోయారు. ఈ క్రమంలో ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల పరిస్థితి దారుణంగా మారింది. అధికారులు రావడానికి కూడా 30 నిమిషాలకు పైగా సమయం పట్టింది. అప్పటి వరకు కనీసం ప్రమాదంలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకువచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ముందుగా స్థానిక అధికారులతో పాటు అగ్ని మాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంది. ఒకవైపు మంటలను అదుపు చేస్తూనే.. మరోవైపు భవనంపై చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో కిందకు దించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు ఎక్కువగా సమయం పట్టింది.

మిన్నంటిన రోదనలు

కొద్ది నిమిషాలకు అన్ని శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అయితే పేలుడు ధాటికి భవన శకలాలు, ఇతర సామగ్రి ఎగిరి అక్కడ పనిచేస్తున్న కార్మికులకు బలంగా తగలడంతో అనేక మంది గాయపడ్డారు. అలాగే పేలుడు కారణంగా వెలువడిన రసాయనాలు పడి కొందరు క్షతగాత్రులయ్యారు. వీరందరినీ సహాయక బృందాలు బయటకు తీసుకువచ్చాయి. అయితే క్షతగాత్రుల రోదనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఒకేసారి ఎక్కువ సంఖ్యలో కార్మికులకు గాయాలవడంతో వారిని అక్కడి నుంచి తరలించడానికి అధిక సమయం పట్టింది. దీంతో వారు ఆ గాయాల నొప్పిని భరించలేక చేసిన రోదనలు మిన్నంటాయి.

అంబులెన్సులు లేకపోవడంతో..

ప్రమాదం జరిగిన గంటన్నర అయినా అంబులెన్సులు సంఘటన స్థలానికి చేరుకోకపోవడం గమనార్హం. దీంతో క్షతగాత్రులను కంపెనీ బస్సుల్లోనే ఆస్పత్రులకు తరలించారు. ఆ తరువాత రెండు అంబులెన్సులు వచ్చినప్పటికీ.. అవి సరిపోలేక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్కడి నుంచి 30, 40 కిలోమీటర్ల మేర ఆ నొప్పితోనే ప్రయాణించాల్సి వచ్చింది.


ఫ్యాక్టరీ ముందు కార్మికులు, బంధువులు, స్థానికులు


మృతదేహాల తరలింపును అడ్డుకుంటున్న బంధువులు


రక్తసిక్తంగా ఘటనా స్థలం

మృతులు, క్షతగాత్రుల్లో ఉత్తరాంధ్రవారే ఎక్కువ

ఈ ప్రమాదంలో 17 మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. వీరిలో భవనం శ్లాబ్ పడి చనిపోయిన వారే ఎక్కువగా ఉన్నారు. శిథిలాల కింద మరో 9 మంది వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొంతమంది మృతదేహాలు గుర్తించలేని పరిస్థితిలో ఉన్నాయి. సంఘటనా స్థలం నుంచి మృతదేహాలను బయటకు తీయడానికి సహాయ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అనేక మంది శరీర భాగాలు ఎగిరిపడడంతో వాటిని ఏరుకోవాల్సి వచ్చింది. కొన్ని ఏకంగా ఛిద్రమై మాంసపు ముద్దలా మారిపోయాయి. మృతుల్లో ఎక్కువ మంది ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారుగా తెలుస్తోంది.

కేజీహెచ్‌కు మాంసపు ముద్దలు

ఘటనా స్థలం నుంచి 13 మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. ఇందులో మాంసపు ముద్దలే వచ్చాయి. ఎవరి కాలు, ఎవరి చేయి, ఎవరిది శరీరమో గుర్తించలేని పరిస్థితి ఉంది. శరీర భాగాలను మూటలు కట్టుకొని తీసుకువచ్చారు. కేజీహెచ్ మార్చురీ వద్ద మృతదేహాలను విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పరిశీలించారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

సాక్షి, విశాఖపట్నం: ఎసైన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాద బాధితులను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం విశాఖ రానున్నారు. ఉదయం 10.50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీకి రానున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకొని అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని పరామర్శించనున్నారు. అనంతరం కోస్టల్ బ్యాటరీకి చేరుకొని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌కి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించనున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుకొని మధ్యాహ్నం 2 గంటలకు విజయవాడ తిరుగు ప్రయాణం కానున్నారు.

మృతుల పేర్లు

1. నీలపు రామిరెడ్డి (49) అసోసియేట్ జనరల్ మేనేజర్/అసోసియేట్ డైరెక్టర్, కొత్త వెంకోజీపాలెం, విశాఖపట్నం
2. హంస ప్రశాంత్ (34) సీనియర్ ఎగ్జిక్యుటివ్, పొందూరు, శ్రీకాకుళం జిల్లా
3. మహంతి నారాయణరావు (34) అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, అర్తమూరు, గరివిడి, విజయనగరం జిల్లా
4. కొప్పర్తి గణేష్‌కుమార్ (33), సీనియర్ ఎగ్జిక్యూటివ్, జువ్వలదొడ్డి, బిక్కవోలు, తూర్పుగోదావరి జిల్లా
5. చల్లపల్లి హారిక (22), ట్రైనీ ఇంజినీర్, రమణయ్యపేట, కాకినాడ
6. పైడి రాజశేఖర్ (23) ట్రైనీ ప్రాసెస్ ఇంజినీర్, వంజంగి, ఆముదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా
7. మారిశెట్టి సతీష్ (31) సీనియర్ ఎగ్జిక్యూటివ్, పాసర్లపూడి, తూర్పుగోదావరి జిల్లా
8. మొండి నాగబాబు (36), అసిస్టెంట్ మేనేజర్, సామర్లకోట
9. నాగేశ్వర రామచంద్రరావు (47), అసిస్టెంట్ మేనేజర్/టీమ్ లీడర్, కూర్మన్నపాలెం, విశాఖ
10. వేగి సన్యాసినాయుడు (53) హౌస్ కీపింగ్ బాయ్, అనకాపల్లి
11. ఎల్లబిల్లి చిన్నారావు (27) పెయింటర్, అచ్యుతాపురం, అనకాపల్లి
12. జవ్వాది పార్థసారధి (27) ఫిట్టర్, పార్వతీపురం,
13. పూడి మోహన్‌దుర్గా ప్రసాద్, హౌస్ కీపింగ్ బాయ్ అచ్యుతాపురం
14. జె.చిరంజీవి (25) ఫిట్టర్, ఎస్.రాయవరం, దార్లపూడి
15. బమ్మిడి ఆనందరావు (35), అసిస్టెంట్ మేనేజర్, విజయనగరం, పూసపాటిరేగ
16. మర్ని సురేంద్ర (37), అసిస్టెంట్ మేనేజర్, ఖమ్మం జిల్లా, అశ్వారావుపేట
17. పి.వెంకటసాయి(28), సీనియర్ ఎగ్జిక్యూటివ్, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, అనకాపల్లి జిల్లా

మెట్లు ఎక్కుతుండగా ప్రమాదం



రెండో షిఫ్ట్ డ్యూటీలో చేరేందుకు కంపెనీ మెట్లు ఎక్కుతున్నా. అదే సమయంలో ధాం అని సౌండ్ వచ్చింది. బిల్డింగ్ ఊగిపోయింది. దీంతో నేను కూడా తూలి కింద పడిపోయాను. నా మీద నుంచి రాళ్లు, శ్లాబ్ పెచ్చులు వెళ్లాయి.

– బి.నూరిబాబు, వై.లోవ, రాంబిల్లి

చుట్టూ చెల్లాచెదురు



ఏడాదిగా పనిచేస్తున్నా. నేనుండేది ఇక్కడే సెజ్ కాలనీలో. ఈ రోజు మధ్యాహ్నం డ్యూటీకి వచ్చిన అరగంటలోనే ఈ ప్రమాదం జరిగింది. భయంకరమైన సౌండ్ వచ్చింది. చుట్టూ అంతా చెల్లాచెదురైంది. నా చేతికి, ముఖంపై గాయాలయ్యాయి. భయంతో తోచిన వైపు పరుగులు తీశా.

– జె.వర్ధన్, హెల్పర్

ఎవరూ పట్టించుకోవట్లేదు



మాది గాజువాకలోని శ్రీనగర్. బి షిఫ్ట్ విధుల్లోకి వచ్చా. ఆఫీస్‌కు వచ్చిన వెంటనే ప్రమాదం జరిగింది. చేతికి గాజు పెంకులు గుచ్చుకున్నాయి. ఆస్పత్రిలో చేర్పి గంటలు గడిచినా ఒక్క డాక్టరూ వచ్చి చూడలేదు. అడిగినా ఎవరూ పట్టించుకోవట్లేదు.

– సీహెచ్ బంగారునాయుడు, కెమిస్ట్

ఇక్కడ చేరి రెండు నెలలే..



ఉద్యోగం కోసం శ్రీకాకుళం నుంచి 2 నెలల క్రితం రాంబిల్లి వచ్చాను. కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నా. మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. వెనక్కి తిరిగి చూసేసరికి ఏమీ కనిపించలేదు. అంతా పొగతో, మంటల్లో కాలిపోతోంది. నాకు ముఖం, చేతి పైన కాలిపోయింది.

– కె.రాంబాబు, క్షతగాత్రుడు

కేజీహెచ్‌కు మృతదేహాలు


మృతదేహాన్ని మూటకట్టి తీసుకువస్తున్న సిబ్బంది


అంబులెన్సులో మృతదేహాల తరలింపు


కేజీహెచ్‌లో పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఎసైన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో మరణించిన 13 మంది ఉద్యోగుల మృతదేహాలను బుధవారం రాత్రి కేజీహెచ్‌కు మార్చురీకి తీసుకొచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, సీతమ్మధార తహసీల్దార్ రమేష్ స్వయంగా పర్యవేక్షించారు. పలువురు క్షతగాత్రులను సెవెన్ హిల్స్, మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

కేజీహెచ్‌కు తీసుకొచ్చిన మృతదేహాలు

సీలపు రామిరెడ్డి, మహంతి నారాయణరావు, మొండి నాగబాబు, చల్లపల్లి హారిక, మారిశెట్టి సతీష్, యళ్లబిల్లి చిన్నారావు, పైడి రాజశేఖర్, మోహనరావు, బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు మృతదేహాలను తీసుకొచ్చారు. నాలుగు మృతదేహాల వివరాలు తెలియలేదు.


కేజీహెచ్ మార్చురీలో ఉద్యోగుల మృతదేహాలు


కేజీహెచ్ మార్చురీకి చేరిన మృతదేహాలు



మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

మహారాణిపేట : తమకు న్యాయం చేయాలని మృతుల కుటుంబ సభ్యులు, వారి బంధువులు కేజీహెచ్ మార్చురీ వద్ద బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం తరఫున, యాజమాన్యం తరఫున కనీస స్పందన లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పంచనామాకు సంతకాలు పెట్టేదిలేదని భీష్మించుకుకూర్చున్నారు. సీఎం చంద్రబాబు గురువారం విశాఖ పర్యటనలో పరిహారం ప్రకటిస్తారని సంతకాలు చేయాలని అధికారులు కోరినా వారు వినలేదు. తమకు న్యాయం చేయకుండా పంచానామా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

ఫార్మసీ కళాశాల విద్యార్థినికి లైంగిక వేధింపులు

తగరపువలస: భీమిలి మండలంలోని ఓ ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థినిని నరేష్ అనే అధ్యాపకుడు ఫోన్ ద్వారా చాటింగ్ చేసి లైంగికంగా వేధించిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై బాధిత విద్యార్థిని బుధవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఫార్మసీ కళాశాల యాజమాన్యం అధ్యాపకుడిని బుధవారం విధుల నుంచి తప్పించినట్టు తెలిసింది.

కూటమి నేతల మధ్య ఫొటో పంచాయితీ

స్కూల్ చైర్మన్ల విజయోత్సవ సభను బాయ్‌కాట్ చేసిన జనసేన

తగరపువలస: ఇటీవల జరిగిన స్కూల్ కమిటీ చైర్మన్ల ఎన్నికలకు సంబంధించి గెలిచిన వారితో విజయోత్సవ సభను బుధవారం కూటమి నాయకులు ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్ ఫొటో వేయలేదు. దీంతో ఆయనతో పాటు హాజరైన జనసేన కార్యకర్తలు, నాయకులు అలకబూని ఆ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేశారు. మరోసారి కూటమి నాయకుల మధ్య అనైక్యత బయట పడింది.

నేడు చిల్డ్రన్స్ జాతీయ కమిషన్ సభ్యుడి రాక

మహారాణిపేట: నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) సభ్యుడు డాక్టర్ దివ్య గుప్తా గురువారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. కలుషిత ఆహారం సంఘటనకు కారణమైన కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆరాధన ట్రస్టును పరిశీలిస్తారు. రాత్రికి తిరిగి ఢిల్లీ వెళతారు.

కోలుకుంటున్న విద్యార్థులు

మహారాణిపేట: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారు. కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది చికిత్స పొందుతున్నారు. వీరికి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు సేవలు అందిస్తున్నారు. నలుగురు విద్యార్థులను నగరంలో పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. 14 మంది కేజీహెచ్ పిల్లల వార్డు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. పిల్లలందరూ కోలుకుంటున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

- గుదిబండగా మారిన ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు
- ఈ విషయంలో ఇరువురి మధ్య మనస్పర్థలు
- భర్త ఎస్‌బీసీలో ఉద్యోగి. భార్య ప్రైవేటు పాఠశాలలో టీచర్



శ్రీనివాసరావు, దేవి మృతదేహాలు



ఇద్దరు పిల్లలతో మృతుడు శ్రీనివాసరావు, మృతురాలి దేవి (ఫైల్)

అగనంపూడి: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు గుదిబండగా మారాయి. ఇల్లు అమ్మి అప్పులు తీర్చేద్దామనే విషయంలో భార్యాభర్తల మధ్య ఏకాభిప్రాయం కుదరక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లపూడి నిర్వాసితకాలనీ యాతపాలెంకు చెందిన గెద్దాడ శ్రీనివాసరావు (40) షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ (ఎస్‌బీసీ)లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య దేవి (37) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల శ్రీనివాసరావు ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం సుమారు రూ.40 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ అప్పు భారంగా మారింది. ఇల్లు విక్రయించి అప్పులు తీర్చేద్దామని భర్త, తరువాత ఎలాగో చూద్దాం వద్దని భార్య గొడవ పడుతూ వస్తున్నారు. ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఇద్దరూ కలిసి ఇంటి తలుపులకు గడియ పెట్టి ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పక్కింట్లో ఉంటున్న సోదరులు ఇంటి తలుపు తట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోంచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐ ఎర్రంనాయుడు చేరుకొని వివరాలు సేకరించారు. మృతులకు తొమ్మిదేళ్ల బాబు లోకేష్, ఏడేళ్ల పాప మహాలక్ష్మి ఉన్నారు. చిన్నారులను అనాథులను చేసి తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకోవడంతో బంధువులు, పరిసర ప్రాంతీయులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు.

అత్తారింటికి వెళ్లొచ్చి..

రాఖీ పండగ కోసం సోమవారం నగరంలో దొండపర్తిలో ఉంటున్న అత్తారింటికి పిల్లలతో కలిసి భార్యాభర్తలు వెళ్లారు. పాపకు జ్వరం కావడంతో పిల్లలిద్దరిని అక్కడే వదిలేసి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యాతపాలెం వచ్చేశారు. సాయంత్రం వారి బాబు లోకేష్ తల్లిదండ్రులకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో వారి ఇంటికి దగ్గరిలో ఉంటున్న అతడి ఫ్రెండ్‌కు ఫోన్ చేసి వాళ్లమ్మకు ఫోన్ ఇమ్మని చెప్పాడు. ఆ బాబు ఇంటికి వెళ్లగా తలుపులు వేసి ఉండడంతో కిటికీలోంచి చూశాడు. ఫ్యాన్‌కు వేళాడుతున్న ఇద్దరిని చూసి పక్కింటిలో ఉన్నవారికి చెప్పాడు.

ప్రాణం తీసిన మ్యాన్‌హోల్

- పదడుగుల లోతులో దిగడంతో ఆక్సిజన్ అందక అస్వస్థత
- కొన ఊపిరితో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



జకీర్‌ను మ్యాన్‌హోల్ నుంచి బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న స్థానికులు



మ్యాన్‌హోల్‌లో అపస్మారకస్థితిలో ఉన్న జకీర్

పెందుర్తి: జీవీఎంసీ యూజీడీ మ్యాన్‌హోల్ ఓ వ్యక్తిని బలితీసుకుంది. జీవీఎంసీ 95వ వార్డు కృష్ణరాయపురం సమీపంలోని బీఆర్‌టీఎస్ రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్ (సంప్)ను పరిశీలించేందుకు అందులో దిగిన కాంట్రాక్ట్ కార్మికుడు ఆక్సిజన్ అందక ప్రాణాలు విడిచాడు. బుధవారం జరిగిన ఈ విషాదఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యానాం ప్రాంతానికి చెందిన జకీర్ (25) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చాడు. కొన్నాళ్ల క్రితం జీవీఎంసీ యూజీడీ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ వద్ద పనికి చేరాడు. ఈ క్రమంలో త్వరలో ప్రారంభం కానున్న కృష్ణరాయపురం లైన్ యూజీడీ పైప్ లైన్‌ను పరిశీలించేందుకు బుధవారం కార్మికులు వచ్చారు. బీఆర్‌టీఎస్ రహదారిపై ఉన్న దాదాపు 10 అడుగుల లోతు ఉన్న మ్యాన్‌హోల్‌లోకి జకీర్ దిగాడు. అయితే లోతుకి దిగిన తరువాత అతడికి ఊపిరి అందకపోవడంతో అందులోనే కుప్పకూలిపోయాడు. కాసేపటి తరువాత గమనించిన తోటి కార్మికులు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి జకీర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నం చేశారు. అయితే అందులోకి ఎవరు దిగినా ఆక్సిజన్ సమస్య ఉండడంతో చాలాసేపు జకీర్‌ను బయటకు తీయలేకపోయారు. చివరకు ఓ వ్యక్తి ధైర్యంగా దిగి జకీర్‌కు తాడు కట్టడంతో బయటకు తీశారు. వెనువెంటనే ఆటోలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జకీర్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఆసిరితాత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొచ్చువేలి-షాలిమర్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొచ్చువేలి-షాలిమర్ (వయా దువ్వాడ మీదుగా) స్పెషల్ రైలును సెప్టెంబరు వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. కొచ్చువేలి-షాలిమర్(06081) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారాలలో సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయల్దేరి ఆదివారాలలో మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో షాలిమర్- కొచ్చువేలి(06082) స్పెషల్ షాలిమర్‌లో ప్రతీ సోమవారాలలో మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20 గంటలకు బయల్దేరి బుధవారాలలో ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు నడుస్తాయి.

పలు రైళ్లు దారి మళ్లింపు

నార్తర్న్ రైల్వే పరిధిలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నారు. విశాఖపట్నం-న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 4 నుంచి 15వ తేదీ వరకు, న్యూఢిల్లీ-విశాఖపట్నం (20806) ఏపీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 6 నుంచి 17వ తేదీ వరకు, విశాఖపట్నం-అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 6, 7, 10, 13, 14వ తేదీల్లో మళ్లించబడిన మార్గంలో వయా ఆగ్రా కంటోన్మెంట్, మిటవలి, గజియాబాద్, న్యూఢిల్లీ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

మెగా జాబ్‌మేళా రేపు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. అపోలో ఫార్మసీ, అమెజాన్ వేర్ హౌస్ తిరువళ్లూర్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ముత్తూట్ గ్రూప్స్, హెల్త్‌కేర్, శ్రీరామ్ చిట్స్ ఇండియా, డబ్ల్యూఎన్‌ఎస్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 758 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్ ఆఫీసర్, ప్రొబిషనరీ ఆఫీసర్, ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, బెడ్ సైడ్ కేర్ గివర్ (బీసీజీ), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, రికవరీ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ ఏదైనా డిగ్రీ, ఆయా ఉద్యోగాల బట్టీ ఉత్తీర్ణత సాధించిన 18-35 సంవత్సరాల వయసున్న పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ10,000 నుంచి రూ31,000ల వరకు ఉంటుందన్నారు

ఏసీబీకి చిక్కిన మల్కాపురం ఎస్ఐ

- అరెస్ట్ చేయకుండా ఉండేందుకు రూ.30 వేల డిమాండ్
- రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కిన వైనం



ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ దేవుడమ్మ

మల్కాపురం: ఓ చీటింగ్ కేసు విషయంలో లంచం తీసుకుంటూ ఎస్ఐ దేవుడమ్మ అడ్డంగా బుక్కయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపురం ఎస్ఐగా దేవుడమ్మ ఏడాదిన్నరగా పనిచేస్తున్నారు. అంతకుముందు స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్‌లో పనిచేశారు. ఈ నెల 10వ తేదీన మల్కాపురం స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. నిందితులను అరెస్టు చేయాల్సి ఉండగా..వారి నుంచి దేవుడమ్మ రూ.30 వేలు ఆశించారు. తొలి విడతగా రూ.10 వేలు, తరువాత రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. బుధవారం రాత్రి 7.30 గంటలకు రూ.10 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా దేవుడమ్మను పట్టుకున్నారు. సుమారు రెండు గంటల పాటు విచారణ అనంతరం దేవుడమ్మను అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఎస్.రమ్య వెల్లడించారు.

‘ఆర్థిక వ్యవస్థ-అమలు విధానం’ సదస్సుకు పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఆర్థిక వ్యవస్థ-అమలు విధానంపై ఈ నెల 29న నోవెటల్ హోటల్‌లో నిర్వహించనున్న సదస్సుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ హరిందిర ప్రసాద్ తెలిపారు. సదస్సుకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖల కార్యదర్శి, అదనపు కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వీరితో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, పోలీస్ అధికారులతో కలిసి బుధవారం కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమం విజయం వంతం చేసేందుకు అధికారులకు ప్రత్యేకంగా విధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా జేసీ వ్యవహరిస్తారని చెప్పారు. సమావేశంలో ఏసీపీ కె.ప్రభాకర్, డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, డీపీఆర్‌వో ఎస్.వి.రమణ, డీఎస్‌వో సూర్యప్రకాశ రావు పాల్గొన్నారు.

సీఎంఆర్ త్రోబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎంఆర్ డైరెక్టర్ మావూరి హారిక

మద్దిలపాలెం: సీఎంఆర్ టెక్స్‌టైల్స్ , జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిడెట్ యాజమాన్యం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు త్రోబాల్ టోర్నమెంట్ 2024ను విజయవంతంగా నిర్వహించామని సంస్థ టెక్స్‌టైల్స్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మావూరి హారిక తెలిపారు. విన్నర్‌గా నిలిచిన సీఎంఆర్ సెంట్రల్‌లోని సీఎంఆర్ ఫ్యాషన్ జట్టుకు రూ.1.50 లక్షలు, రన్నర్స్‌గా నిలిచిన గోపాలపట్నం సీఎంఆర్ జ్యూయలర్స్ జట్టుకు షీల్డ్ సర్టిఫికెట్లను హారిక అందజేశారు. త్రోబాల్ టోర్నమెంట్‌కు 40 స్టోర్స్‌ల నుంచి 800 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. పోటీలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించామన్నారు.

జూడాలకు సింగర్ యశస్వి సంఘీభావం



పాటతో సంఘీభావం తెలుపుతున్న సింగర్ యశస్వి

బీచ్‌రోడ్డు: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జూడాలు కొద్ది రోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా ప్రముఖ సింగర్ యశస్వి ప్రదర్శన చేశారు. సిరిపురంలోని దత్తా ఐల్యాండ్ వద్ద బుధవారం ఆయన తన పాటలతో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజ్ విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను సందర్శించిన మంత్రి కొల్లు



మంత్రికి ప్లాంట్ గురించి వివరిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆయన స్టీల్‌ప్లాంట్‌కు చేరుకున్నారు. అక్కడ స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లతో సమావేశమయ్యారు. ప్లాంట్ సమస్యలు, ప్రస్తుత పరిస్థితిని ప్రజాప్రతినిధులకు సీఎండీ వివరించారు. మంత్రి ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్‌ను సందర్శించగా అధికారులు వారికి ప్లాంట్ గురించి వివరించారు. బ్లాస్ట్‌ఫర్నేస్-3ను మంత్రి సందర్శించి, ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు.

రైలింజన్‌లో మొండెం లేని తల లభ్యం

తాటిచెట్లపాలెం: సుమారు 40 ఏళ్ల మగ వ్యక్తి తల రైలింజన్‌లో చిక్కుకుని ఉండడం గుర్తించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు...రాయపూర్-విశాఖపట్నం పాసింజర్ ఇంజన్ బోగిలో ఇరుక్కున్న తలను గుర్తించిన సిబ్బంది, మిగిలిన శరీరం కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు లేవని, ఇతని ఆచూకీ తెలిసిన 8639865434 / 94406 27547 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

29న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక

మహారాణిపేట: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో 29న మధ్యాహ్నం 12.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి నేవల్ బేస్‌కు వెళ్తారు. 12.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంట వరకు నేవల్ బేస్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. కొద్ది సేపు విశ్రాంతి తీసుకొని మధ్యాహ్నం 3.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 3.20 గంటలకు విమానంలో తిరువునంతపురం వెళ్తారు.

వైద్య విద్యార్థుల ప్రదర్శన



ప్రభుత్వ మానసిక వైద్యశాల ఎదుట ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: కోల్‌కతాలో ఇటీవల మెడికో హత్యకు నిరసనగా జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కళాశాల వద్ద వద్ద మొదలైన ప్రదర్శన కేజీహెచ్ సూపరింటెంటెంట్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం మీదుగా పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యశాల వరకు సాగింది. మానసిక వైద్యశాల ఎదురుగా వైద్య విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. తిరిగి బీచ్‌రోడ్డుమీదుగా మెడికల్ కళాశాలకు చేరుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ టీ.పృధ్వీరాజ్, ఆర్.ఊహ, రాజా వివేక్ ,డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున వర్షాలు నేపథ్యంలో కేకే లైన్ మార్గంలో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో దంతేవాడ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి. ఈ తేదీల మధ్య దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో మిగులు సీట్లకు ప్రవేశాలు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. ఐదో తరగతిలో 18, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 33 సీట్లు ఖాళీలు ఉన్నటుల్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9010379390 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.98
బ్రాయిలర్ (లైవ్)	: రూ.118
స్కిన్	: రూ.206
స్కిన్‌లెస్	: రూ.216

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	505.00
విజయనగరం	509.00
శ్రీకాకుళం	509.00

ఆర్‌వోబీ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌కు అనుబంధంగా చేపట్టిన ఆర్‌వోబీ(రైల్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సాంకేతిక విభాగం చేపట్టిన పనుల ప్రగతిని సమీక్షించారు. బోయపాలెం బృహత్తర ప్రణాళిక రహదారి మధ్యలో ఉన్న హెచ్‌టీ ఎలక్ట్రికల్ లైన్స్‌ను తరలించి సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలన్నారు. మామిడిలోవ, గిడిజాలలో ఆర్‌సీ లేఅవుట్లలోని సీసీ కాలువలు, సీడీ వర్క్స్ పనులను కాంట్రాక్టర్‌తో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీఆర్ సంబంధిత అంశాలపై అక్కడక్కడ నిలిచిన బృహత్తర ప్రణాళికా రహదారుల నిర్మాణం విషయంలో జీవీఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. వీఎంఆర్‌డీఏ చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక కొరత లేకుండా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం చేపట్టే ప్రతి పని నిర్దిష్ట కాల పరిమితిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు, ఏఈలు, పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న లగుడు గోవింద రావు

బీచ్‌రోడ్డు: అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందజేయాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బుధవారం ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం కంపెనీలపై చర్యలు తీసుకోకపోవడం వల్లే తరుచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు దివీస్ రూ.6.45 లక్షల సాయం



బాక్సింగ్ క్రీడాకారులతో దివీస్ ప్రతినిధులు

తగరపువలస: సెప్టెంబర్ 4 నుంచి 7 వరకు నేపాల్‌లో జరగనున్న నేషనల్ బాక్సింగ్ పోటీలలో పాల్గొనున్న 17 మంది క్రీడాకారులకు భీమిలి మండలం చిప్పాడ దివీస్ యాజమాన్యం బుధవారం రూ.6.45 లక్షల ఆర్థిక సాయం అందించింది. మండలంలోని చిప్పాడ, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీలకు చెందిన క్రీడాకారుల ఎంట్రీ ఫీజు, ప్రయాణ ఖర్చులకు గాను ఒక్కొక్కరికి రూ.35వేలు వంతున సంస్థ డైరెక్టర్ ఎస్. దేవేంధర్‌రావు, జనరల్ మేనేజర్ వైఎస్ కోటీశ్వరారావుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా హర్యానాలోని రోహతక్‌లో జరిగిన నేషనల్ బాక్సింగ్ పోటీలలో కాంస్య పతకం సాధించిన చిప్పాడ జడ్పీహైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని వెంపాడ కుష్మితను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎల్వీ రమణ, ఇంజనీరింగ్ విభాగపు జనరల్ మేనేజర్ ఇ.రామకృష్ణ, కోచ్ ఆదినారాయణ, సీఎస్ఆర్ విభాగం ప్రతినిధులు శ్రీనివాస్, శేఖర్‌బాబు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై సమీక్ష

డాబాగార్డెన్స్: గ్రేటర్ పరిధిలో ప్రజలకు కల్పించే మౌలిక వసతుల కల్పనపై జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బుధవారం జీవీఎంసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి కుళాయి కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి? ప్రజలకు అందించే తాగునీటిపై ప్రతిరోజూ నాణ్యతా పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. ప్రతిరోజు వ్యర్థాల విభజన, ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో నూతనంగా ఎన్ని సోలార్ ప్రాజెక్టులు ఏర్పా టు చేయవచ్చో తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, డీవీ రమణమూర్తి, ప్రధాన ఇంజినీరు వినయ్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ(ఆర్) శ్రీనివాస్, యూసీడీ పీడీ ఎంవీడీ ఫణిరాం, పర్యవేక్షక ఇంజినీర్లు వేణుగోపాల్, వై కృష్ణారావు పాల్గొన్నారు.